## పరిశోధనలకు ప్రోత్సాహం..

# ప్రయోజనాలే లక్ష్యం



**జేఎన్‌టీయూలో గ్లోబల్ అలుమ్ని 22న**

ఇంజినీరింగ్ చేశాం..ఇట్టే ఉద్యోగం పట్టేస్తామనుకునేవారిలో చాలామంది మంచి అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కావాల్సిన నైపుణ్యాలతో సంసిద్ధంగా లేకపోతే.. కంపెనీలు సైతం క్యాంపస్‌లోనే కాదు.. తర్వాత కూడా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకురాని పరిస్థితులు చూస్తున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకొని జేఎన్‌టీయూ హెచ్ గ్లోబల్ అలుమ్ని వేదికగా.. ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ పరిశోధనలు, పరిశ్రమల స్థాపన దిశగా ముందుకు నడిపించేందుకు కార్యాచరణ రూపొందించింది.

**- న్యూస్‌టుడే, కూకట్‌పల్లి**

ఈ నెల 22న గ్లోబల్ అలుమ్ని (అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం) వర్సిటీలో నిర్వహించనున్నారు. రెండేళ్ల క్రితం ఇదే తరహాలో నిర్వహించినా కేవలం భవనాల పునరుద్ధరణ, సెమినార్ హాల్స్ నిర్మాణం లక్ష్యంగా పూర్వ విద్యార్థులు సహకరించారు. ఈ సారి విద్యార్థులకు ప్రయోజనం చేకూరాలన్నది అధికారుల ఆలోచన. ఈ దిశగా ఇప్పటికే దేశంలోనే కాకుండా అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో పరిశ్రమలు నిర్వహిస్తున్న, వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులకు సమాచారం అందించారు. ఇందులో భాగంగా 345మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

### వివిధ అంశాల్లో

◆ వివిధ విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే కొందరు పూర్వ విద్యార్థులు కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ కేంద్రంలో నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. అలాగే మరికొన్ని సెంటర్లను నెలకొల్పాలన్న ఆలోచనలో ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి, అలుమ్ని డైరెక్టర్ డాక్టర్ పి. భ్రమర తెలిపారు. ◆ పరిశ్రమల స్థాపన దిశగా విద్యార్థులకు శిక్షణ, సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు స్టార్టప్‌ల విషయంలో ఆర్థికంగా సహకరించేందుకు మరికొందరు ఆసక్తి చూపుతున్నారు. ◆ ఎంతో కీలకమైన నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు కావాల్సిన ఎక్విప్‌మెంట్, అధ్యాపకుల నియామకానికి సహకారం అందనుంది. ◆ విదేశీ కరెన్సీని ఇందుకోసం వినియోగించేవారికి పన్ను రాయితీ ఇచ్చేలా చేయడంతో చాలామంది విద్యార్థుల ప్రయోజన నిధి కోసం బదిలీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వర్సిటీ అధికారులు చెప్పారు.

# రేపు జేఎన్‌టీయూకు సీఎం రాక



**వర్సిటీలో నిర్మిస్తున్న వజ్రోత్సవ పైలాన్**

కూకట్‌పల్లి:జేఎన్‌టీయూలో వజ్రోత్సవ, అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 21, 22 తేదీల్లో ఈ వేడుకలు జరగనుండగా.. మొదటిరోజు వజ్రోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. వజ్రోత్సవ పైలాన్ పనులు తుది దశకు చేరుకున్నాయి.

# ఎమర్టెక్స్‌తో జేఎన్టీయూ ఒప్పందం

## డీప్ టెక్ డొమైన్స్‌లో టెక్నాలజీపై దృష్టి



**కూకట్ పల్లి, వెలుగు:** డీప్ టెక్ డొమైన్స్‌లో సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలపై సమగ్ర దృష్టి సారించడం కోసం జేఎన్టీయూ ప్రత్యేక చర్యలు చుట్టింది. ఇందులో భాగంగా బెంగళూరుకు చెందిన ఎమర్టెక్స్ఇన్నర్మేషన్‌టెక్నాలజీస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వర్సిటీ వీసీడాక్టర్‌కిషన్‌కుమార్‌రెడ్డి, ఎమర్టెక్స్ డైరెక్టర్ జయకుమార్ ఒప్పందంపై బుధవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందాన్ని స్కిల్ ఇండియా, డిజిటల్‌ఇండియా, మేకిన్‌ఇండియా వంటి జాతీయ మిషన్లతో అనుసంధానం చేయనున్నట్లు వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంబెడెడ్ సిస్టమ్స్‌లో సమగ్రమైన పరిశ్రమ ఆధారిత శిక్షణ అందించడంతో పాటు ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ సదుపాయం కల్పిస్తామని వివరించారు.